క్లుప్తంగా

పరామర్శ



నివాళులర్పిస్తున్న మార్నేని రవీందర్‌రావు

ఐనవోలు: మండలంలోని 44వ డివిజన్ సింగారం గ్రామానికి చెందిన మాజీ డీసీసీబీ చైర్మన్ దోపతి దామోదర్‌రెడ్డి భార్య దోపతి సూరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. చైర్మన్ వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామంలోని నిరుపేద పద్మశాలి కుటుంబానికి చెందిన స్వర్గం రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామస్తులు ఆదివారం రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 12,500 ఆర్థిక సాయం అందించారు.

ఆటోయూనియన్ నూతన కమిటీ ఎన్నిక



రవి, అధ్యక్షుడు

ఎల్కతుర్తి : మండల కేంద్రంలో ఆటో యూనియన్ నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా గూడెల్లి రవి, ఉపాధ్యక్షుడిగా శనిగరం రా జ య్య, ప్రధాన కార్యదర్శిగా శనిగరం సాంబరాజు, గౌరవ అధ్యక్షుడిగా దేవేందర్‌రెడ్డి, ముఖ్య సలహాదారుగా వెంకటేష్‌యాదవ్, కోశాధికారిగా కోరె భిక్షపతి, ప్రచార కార్యదర్శిగా రాజుతో కమిటీ మెంబర్లను ఎన్నుకున్నారు.

అనారోగ్యంతో మాజీ జెడ్పీటీసీ మృతి



సరిత మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య



సరిత(ఫైల్)

వేలేరు : మాజీ జెడ్పీటీసీ చాడ సరిత(48) అనారోగ్యంతో ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో మృతి చెందింది. ఆదివారం సాయంత్రం ఆమె మృతదేహాన్ని స్వగ్రామమైన మల్లికుదుర్ల గ్రామానికి తీసుకొచ్చారు. సరిత 2019లో బీఆర్‌ఎస్ నుంచి వేలేరు జెడ్పీటీసీగా గెలుపొందింది. మరణవార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల ప్రజలు ఆమె కుటుంబానికి సంతాపం తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

దామెర : పేకాడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసిన ఘటన పోలీస్ స్టేషన్ పరిధిలో ఆది వారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిసిన కథనం ప్రకారం మండలంలోని ఊరుగొండ శివారులో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. కాగా మూడు ముక్కలాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.23,200 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరో ఇద్దరు పారిపోగా మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి



సాంబరాజు (ఫైల్)

ఎల్కతుర్తి : మండలంలోని గోపాల్‌పూర్ గ్రామ శివారులోని ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్‌పూర్‌కు చెందిన గండికోట సాంబరాజు(38) బావిలో పడి మృతి చెందా డు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నిలిచిన పారిశుద్ధ్య పనులు

- వీధుల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారం
- వృద్ధి చెందుతున్న దోమలు, ఈగలు
- పట్టించుకోని అధికారులు, పంచాయతీ సిబ్బంది



పాత గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో పేరుకుపోయిన చెత్త



2వ వార్డు సమీపంలో రహదారి పక్కనే పెరిగిన పిచ్చిమొక్కలు

ఎల్కతుర్తి: గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేయడంతో ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వర్షాలతో ప్రధాన వీధులగుండా చెత్తా, చెదారం పేరుకుపోయి అంటువ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని వీధుల్లో డ్రెయినేజీ కాల్వల్లోని నీరు ఎక్కడికక్కడే పేరుకుపోయి దోమలు, ఈగలకు ఆవాసంగా మారాయి. దీనికి తోడు వీధికుక్కలు, పందులు చెత్తా, చెదారం ఉన్నచోట మరింతగా అపరిశుభ్ర పరుస్తున్నాయి. ఇటీవలగా కురిసిన వర్షాలతో పలు వీధుల గుండా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి చిత్తడిగా ప్రధాన రహదారులు మారాయి. స్ట్రీట్ లైట్లు లేకపోవడంతో వీధులన్నీ చీకటిని తలపిస్తున్నాయి. రాత్రి వేళల్లో రహదారుల వెంబడి నడవాలంటేనే భయంగా ఉందని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామాలకు సరఫరా చేసే తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయకపోవడంతో వాటిలో నుంచి సరఫరా అయ్యే తాగునీటిలో నాచుతో కూడిన చెత్త వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్యాంక్‌లో బ్లీచింగ్ పౌడర్ చల్లి తాగునీటి ట్యాంక్‌లను కడిగి తాగునీటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వీధులను జీపీ సిబ్బంది చేత పరిశుభ్రత చర్యలు చేపట్టేవారన్నారు. ప్రస్తుతం ఉన్న కార్యదర్శి పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి జీపీ సిబ్బందిచే తాగునీటి సరఫరా చేసే ట్యాంక్‌లను శుభ్రం చేయడంతో పాటు, వీధుల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారాన్ని తొలగించి శుభ్రం చేయలని కోరుతున్నారు. దోమలకు ఆవాసంగా మారిన డ్రెయినేజీ కాలువలు ఇటీవల కురిసిన వర్షాలతో పలు వీధుల గుండా పేరుకుపోయిన చెత్తా, చెదారంతో పాటు డ్రెయినేజీ కాల్వలు అస్తవ్యస్తంగా మారాయి. అధికారులు గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టక పోవడంతోనే జ్వరాలు, దగ్గు, జలుబు వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో రెండేళ్లుగా ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు కుంటుపడడంతో పాటు పారిశుద్ధ్యం లోపించిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వర్షాకాలం సందర్భంగా ఎప్పటికప్పుడు జీపీ సిబ్బంది చేత పారిశుద్ధ్యం పనులు నిర్వహించి డ్రెయినేజీ కాల్వలను శుభ్రపర్చడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



కమలాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమలాపూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఆర్డినెన్స్ తేవడాన్ని హర్షిస్తూ కమలాపూర్, ఉప్పల్ గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం వేర్వేరుగా క్షీరాభిషేకాలు నిర్వహించారు. కమలాపూర్‌లో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సీఎం, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఉప్పల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడ శ్రీకాంత్, బొంకూరి కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్యగౌడ్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గుండవు చరణ్‌పటేల్, ఇల్లందకుంట దేవస్థాన డైరెక్టర్ నారాయణరెడ్డి, కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, ఏఎంసీ చైర్ పర్సన్ తొటం ఝాన్సీరాణిరవీందర్, నాయకులు మారెపెల్లి మహేష్, నాగరాజు, విష్ణుదాసు వంశీధర్‌రావు, మొగిలయ్య, గణేష్, సత్యపాల్, రాజేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్ సంతోష్

పరకాల : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ ప్రజానీకం రుణపడి ఉంటారని మాజీ కౌన్సిలర్ పొరండ్ల సంతోష్ అన్నారు. ఆదివారం 3వ వార్డు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి కృషి చేస్తామన్నారు. సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ శివకుమార్, వార్డు అధ్యక్షుడు ప్రశాంత్, ఉపేందర్, సూర్యప్రతాప్, తిరుపతి, శివకుమార్, శ్రీను, పట్టాభి దినేష్ పాల్గొన్నారు.

ముగ్గురి అరెస్ట్

కాజీపేట: కాజీపేట పట్టణ శివారులోని సోమిడి ఎఫ్‌సీఐ గోడౌన్ల సమీపంలో గంజాయి క్రయ, విక్రయాలు జరపడానికి వచ్చిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 100 గ్రాముల శుద్ధి చేసిన ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఎస్సై లవన్ కుమార్ ఆదివారం పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని ఆపి తనిఖీ చేయగా గంజాయి లభించింది. వీరిని అరెస్ట్ చేసినట్లు సీఐ వివరించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

విరాళం అందజేత

గీసుకొండ: మండలంలోని మనుగొండ కాష్ఠాలగడ్డ వెళ్లే దారిలో వంతెన నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.2.50 లక్షలు విరాళంగా గ్రామస్తులకు అందజేశారు. బాలకిశోర్‌రెడ్డి పంపిన నగదును కాంగ్రెస్ పార్టీ నా యకులు అల్లం మర్రిరెడ్డి, బగ్గి రవి, తోట కమలాకర్ గ్రామస్తులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు చాపర్తి సాంబయ్య, పేర్ల అగయ్య, చాపర్తి మొగిలి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి



మాట్లాడుతున్న తంపుల మోహన్

ఐనవోలు : బీఆర్‌ఎస్ కార్యకర్తలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ గుజ్జ గోపాల్‌రావు, మండల కన్వీనర్ తంపుల మోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని కొండపర్తి గ్రామంలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన గోపాల్‌రావు, మోహన్ మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. ఎక్కువ మంది ఎంపీటీసీలను గెలిపించుకుని ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకోవడంతో పాటు జెడ్పీటీసీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు కట్కూరు చంద్రమౌళి, గద్దల ప్రభాకర్, కట్కూరి అరుణ్ కుమార్, నీరటి రాజశేఖర్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

యువత లక్ష్యంతో ముందుకు సాగాలి



సాయి‌శివానిని సన్మానిస్తున్న ఆర్డీఓ నారాయణ, పెరికసంఘం నాయకులు

ఆత్మకూరు : యువత లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని సివిల్స్ ఆల్ ఇండియా 11వ ర్యాంకర్ ఇట్టబోయిన సాయిశివాని అన్నారు. మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో ఆమెను పెరిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన అమ్మమ్మ ఊరు నీరుకుళ్లతో తనకు మంచి అనుబంధం ఉందని గుర్తు చేశారు. యువతీ యువకులు బ లమైన లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలన్నారు. భయాన్ని వీడితే విజయం వరిస్తుందని అన్నారు. ప్రణాళిక బ ద్ధంగా కష్టపడితే ఉన్నత విజయాలు వస్తాయన్నా రు. తల్లిదండ్రుల స్ఫూర్తితో తాను సివిల్స్ ర్యాంకు సాధించానన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ నారాయణ, పెస్టిసైడ్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు, బాలకృష్ణమూర్తి, ప్రవీణ్, పెరిక సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హెచ్‌సీఏను పూర్తిగా రద్దు చేయాలి

- వరంగల్ క్రికెట్ సంఘం మాజీ కార్యదర్శి ఉదయభానురావు



మాట్లాడుతున్న మార్నేని ఉదయభానురావు

వరంగల్ స్పోర్ట్స్: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కమిటీని పూర్తిగా రద్దు చేయాలని వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మార్నేని ఉదయభానురావు డిమాండ్ చేశారు. హనుమకొండలోని రామారావు క్రికెట్ క్లబ్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 13 ఏళ్లుగా జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేశానని, అప్పుడు ఏనాడూ హెచ్‌సీఏపై ఆరోపణలు రాలేదన్నారు. ప్రస్తుత హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుపై వస్తున్న అవినీతి, అక్రమాల ఆరోపణలతో క్రికెటర్లపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. జిల్లాలో క్రికెట్ అభివృద్ధి, క్రికెటర్లకు మెరుగైన వసతుల కల్పించాలని హెచ్‌సీఏ అనేకమార్లు వినతి పత్రాలు అందజేసినా కంటితుడుపు చర్యలు చేసి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ క్రికెట్ సంఘం స్థానంలో తెలంగాణ క్రికెట్ సంఘం పేరుతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. సమావేశంలో వరంగల్ క్రికెట్ అసోసియేషన్ మాజీ సంయుక్త కార్యదర్శి బండారి ప్రభాకర్, మాజీ కార్యవర్గ సభ్యుడు మట్టెడ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి బోనాలు

- ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ఆదివారం మహంకాళి బోనాల ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ తర్వాత తెలంగాణ రాష్ట్రంలో సికింద్రాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాలో గట్లకానిపర్తిలోనే మహంకాళి మాతా బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబంగా బోనాల ఉత్సవాల జాతర నిలుస్తుందన్నా రు. తెలంగాణలో బోనాలకు ఒక ప్రత్యేక స్థానం ఉందని, దేవతలను పూజించేందుకు బోనం ఎత్తే సంప్రదాయం రాష్ట్ర వ్యాప్తంగా ఉందని తెలిపారు. మహంకాళి అమ్మవారి అనుగ్రహంతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. గట్లకానిపర్తి గ్రామస్తులంతా ఐకమత్యంగా ఉండాలని, గ్రామానికి అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేసేందుకు తన వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మహిళలు బోనాలు ఎత్తుకొని డీజే సౌండ్స్, డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా మహంకాళి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. నైవేద్యాలు సమర్పించారు. సల్లంగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న క్షమాపణ చెప్పాలి

- జాగృతి యువత రాష్ట్ర నాయకుడు అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

శాయంపేట : పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై చేసిన వ్యాఖ్యలు మహిళా సమాజాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని వెంటనే మహిళా సమాజానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న క్షమాపణ చెప్పాలని జాగృతి యువత రాష్ట్ర నాయకుడు అమ్మ అశోక్ డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దకోడెపాకలో ఏర్పాటు చేసిన జాగృతి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న కవితపై చేసిన అనుచితమైన వ్యాఖ్యలను ఖండిస్తూ ఎమ్మెల్సీ కవిత అభిమానులు, జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ నాయకులు నిరసన తెలుపడానికి తీన్మార్ మల్లన్న ఆఫీసుకు వెళ్తే తన గన్‌మెన్‌లతో కాల్పులు చేయించి గాయపరిచారని తెలిపారు. తీన్మార్ మల్లన్న ఆఫీస్‌కు నిరసన తెలుపడానికి బీసీ బిడ్డలే వచ్చారని తెలిసి కూడా వారిపై దాడులు చేయించడం సిగ్గుచేటన్నారు. క్రిమినల్ ఆలోచనలు ఉన్న తీన్మార్ మల్లన్న బీసీలకు ఏం న్యాయం చేయగలరని, మహిళలపై గౌరవం లేని తీన్మార్ మల్లన్నపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు గొట్టె అజయ్, పోతురాజు మనోజ్, వరుణ్, జస్వంత్ పాల్గొన్నారు.

ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణంలో జాప్యమెందుకు ?

- కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం
- ఆగస్టులో పూర్తి కాకుంటే రైల్‌రోకో చేస్తాం



ఉప్పల్ ఆర్వోబీ వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ వద్ద నిర్మిస్తున్న ఆర్వోబీ పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉప్పల్‌లో నిర్మిస్తున్న ఆర్వోబీ వద్ద కాంగ్రెస్ శ్రేణులు నిరసన, ఆందోళన చేపట్టారు. ఏఎంసీ చైర్ పర్సన్ తొటం ఝాన్సీరాణిరవీందర్ మీడియాతో మాట్లాడుతూ నెల రోజుల క్రితం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదేశానుసారం బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆర్వోబీ పనులను పరిశీలించి జూన్ నెలాఖరు నాటికి ఆర్వోబీని పూర్తి చేయకపోతే బుల్డోజర్లతో ఆర్వోబీని కూల్చివేస్తామన్నారన్నారు. ఆ గడువు ఎప్పుడో దాటిపోయిందని, బీజేపీ నాయకులు ప్రకటనలకే పరిమితమని, చేతల్లో కాదని ఎద్దేవా చేశారు. మత రాజకీయాలు చేసే బండి సంజయ్‌కు ప్రజల సమస్యలపై పట్టింపులేదని విమర్శించారు. ఆగస్టు చివరి నాటికి ఆర్వోబీ పనులు పూర్తి చేయకపోతే రైల్‌రోకో చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మారెపెల్లి మహేష్, వాసాల శ్రీనివాస్, విష్ణుదాసు వంశీధర్‌రావు, మొండెద్దుల నాగరాజు, శ్రీధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఎల్కతుర్తి : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. 2005–06 విద్యా సంవత్సరానికి చెందిన విశ్వశాంతి విద్యాలయంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం 2000–2001 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితురాలు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో, మెమొంటోలతో సత్కరించారు.

దామెర : చిన్ననాటి స్నేహితులందరూ 17 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి సందడి చేశారు. మండలంలోని పసరగొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007–08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఎన్నో ఏళ్ల తరువాత సమావేశం అయిన సందర్భంగా వారంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురవులను ఘనంగా సన్మానించారు.



శాయంపేట : సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



దామెర : పసరగొండ పాఠశాలలో..

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



సూర్యనారాయణను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

హసన్‌పర్తి: పదవీ విరమణ అనంతరం సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని మున్నూరు కాపు సంఘం ఎర్రగట్టు గుట్ట ఏరియా అధ్యక్షుడు నంది శ్రీనివాస్ సూచించారు. 36 ఏళ్ల పాటు రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఆసిఫాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ పొందిన హసన్‌పర్తికి చెందిన తోట సూర్యనారాయణను ఆదివారం ఘనంగా సన్మానించారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు తోట నాగరాజు, ప్రధాన కార్యదర్శి తోట రాజ్యం, కోశాధికారి బండారు సుమన్, సభ్యులు పాల్గొన్నారు.